క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జూబిలీ ఇండోర్ సబ్ స్టేషన్ 11 కేవీ డోర్నకల్ రోడ్డు ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7.30 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సూర్యారావుపేటలోని వెంకటరత్నం వీధి, విష్ణువర్ధనరావు వీధి, డోర్నకల్ రోడ్డు, నరసింహారావు నాయుడు వీధి, గోవిందరాజులు నాయుడు వీధి, చిలుకు దుర్గయ్య వీధి, తాడేపల్లి వారి వీధి, పీసపాటి వారి వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లో విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

ముత్యాలంపాడు పరిధిలో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు సెక్షన్ 11 కేవీ నల్ల గేటు ఫీడర్ పరిధిలో విద్యుత్ వైర్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్రబాబు గురువారంలో ఓ ప్రకటనలో తెలిపారు. తాడింకి వారి స్ట్రీట్, రామాలయం వీధి, గడియారం వారి వీధి, అబ్బూరు వారి వీధి, వ్యాకరణం వారి వీధి, ముదిగొండ వారి వీధి, తిరుమల శెట్టి వారి వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతుందన్నారు.

ముగిసిన సీతారాముల కల్యాణ మహోత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్ శ్రీ కోదండ రామమందిరం సీతారాముల కల్యాణోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. ఆలయ అర్చకులు సీతారాములకు ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం కల్యాణ విందు చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు సీతారాములను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, విందు స్వీకరించారు. 2 వేల మంది భక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం పవళింపు సేవ జరిగింది. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కాటూరి వీర్రాజు గంగిశెట్టి సాంబశివరావు, కొండపల్లి సాంబశివరావు, రామారావు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

టీటీడీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ



విజయవాడకల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీవారి అన్నప్రసాదం భక్తులకు చేరువ చేసే కార్యక్రమంలో భాగంగా పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో ఎస్వీజీ ప్రసాద్, రాజ్యలక్ష్మి, జోతిర్మాను సహకారంతో 300 మంది భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. గురువారం ఉదయం దేవాలయంలో పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమల శ్రీవారి సేవకు ఉపయోగించిన పూలతో తయారైన సుగంధ ద్రవ్యాలు, గంధం,వీభూది అగర బత్తీలను కౌంటర్ ద్వారా విక్రయించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవి మాట్లాడుతూ.. శ్రీవారి అన్నప్రసాద సేవలో పాల్గొనే వారు కల్యాణ మండపంలోని కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ప్యాక్డ్ ఎల్పీజీ ట్రాన్స్‌పోర్టర్స్ సంఘం అధ్యక్షుడిగా సురేష్



పటమట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్యాక్డ్ ఎల్పీజీ ట్రాన్స్‌పోర్టర్స్ అసోసియేషన్ నూతన సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు అధ్యక్షుడు సూరపనేని సురేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడ నగరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో అసోసియేషన్ చైర్మన్‌గా జీవీఎస్ శర్మ, కార్యదర్శిగా ఆర్. శివకుమార్, కోశాధికారిగా పీహెచ్.రామకృష్ణను ఎన్నుకున్నామన్నారు. అనంతరం పలువురు సభ్యులతో కమిటీ నియమించామని చెప్పారు.

ఏఐ టెక్నాలజీదే భవిష్యత్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): భవిష్యత్ అంతా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌దేనని మైక్రోసాఫ్ట్ సంస్థ(అమెరికా)లో కృత్రిమ మేథస్సు పరిశోధకుడు ప్రియతమ్ బొల్లింపల్లి చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో కృత్రిమ మేథస్సు ఉపయోగాలు– ఉపయోగించడం ఎలా అనే అంశంపై గురువారం సదస్సు జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్ సి.జంపాల, అధ్యాపకులతో పాటు ఎమ్మెసీ, ఎంసీఏ, ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల సందేహాలను ప్రియతమ్ నివృత్తి చేశారు.

భౌ భౌలను నియంత్రించరూ !

- విజృంభిస్తున్న గ్రామ సింహాలు
- రోడ్లపైకి రావాలంటేనే హడలెత్తిపోతున్న ప్రజానీకం



గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు (ఫైల్)

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో గ్రామ సింహాలు విజృంభిస్తున్నాయి. వీధి కుక్కలను నియంత్రించాల్సిన అధికారులు కనీస చర్యలు తీసుకోవటం లేదని నగరవాసులు ఆరోపిస్తున్నారు. ఇటీవల గుంటూరులో జరిగిన వీధి కుక్కల దాడి వంటి ఘటనలు ఎక్కడ పునరావృతం అవుతాయోనని నగర వాసులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. ముఖ్యంగా వాంబే కాలనీ, అజిత్‌సింగ్‌నగర్, రామకృష్ణాపురం, జీవీఆర్‌నగర్, దేవీనగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్, లోటస్ ల్యాండ్ మార్క్, శాంతినగర్, దుర్గాపురం, మాచవరం తదితర ప్రాంతాలలో వీధి కుక్కలు విపరీతంగా ఉన్నాయి. వీధి కుక్కలు పగలు, రాత్రి తేడా లేకుండా రోడ్లపై సంచరిస్తూ భయాందోళనలు సృష్టిస్తున్నాయి. చీకటి పడితే రోడ్డుపై వీధి కుక్కలు అరుస్తూ వాహన చోదకుల వెంటపడి తరుముతున్నాయి. దీంతో రాత్రిపూట రోడ్లపైకి రావాలంటేనే వాహన చోదకులు, పాదచారులు హడలిపోతున్నారు. ఇటీవల దావు బుచ్చయ్యకాలనీలో కుక్కలు ఒక మహిళ వెంటపడి తరిమి గాయపరిచాయి. దీంతో ఆమె ఆస్పత్రి చుట్టూ తిరుగుతూ చికిత్స చేయించుకుంటున్నారు.

కనీస చర్యలు శూన్యం

వీధి కుక్కల నియంత్రణకు అధికారులు కనీస చర్యలు తీసుకోవటం లేదని వాహన చోదకులు, పాదచారులు ఆరోపిస్తున్నారు. వీధి కుక్కలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయటంతో పాటు వ్యాక్సిన్ వేసి ఎక్కడ నుంచి తీసుకువెళ్లారో అక్కడే వదలివేయాల్సి ఉంది. అయితే అధికారులు కనీసం వీధి కుక్కల గురించి పట్టించుకోవటం లేదు. దీంతో వీధి కుక్కలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బిక్కుబిక్కుమంటూ రాకపోకలు

వీధి కుక్కలు రాత్రిపూట రహదారులపై రాకపోకలు సాగించేవారిని వెంటపడి తరుముతున్నాయి. ఈ క్రమంలో ఎంతో మంది గాయాల బారిన పడ్డారు. విధులను ముగించుకుని రాత్రిపూట తిరిగి ఇంటికి వచ్చే వారు, తెల్లవారుజామున, రాత్రిపూట పనులపై బయటకు వెళ్లే వారు రోడ్డుపై బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. వీధి కుక్కల కారణంగా సాయంత్రం వేళల్లో సరదాగా కుటుంబ సమేతంగా బయటకు వచ్చేందుకు నగర వాసులు జంకుతున్నారు. ద్విచక్ర వాహనాలు, కార్లు వెంటపడి తరుముతుండటంతో ఇక పాదచారులు గుండెలను అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రి వేళల్లో ఎటువైపు నుంచి వస్తున్నాయో తెలియటం లేదని స్థానికులు వాపోతున్నారు

ఆందోళనగా ఉంది..



నేను ఊరు వెళ్లి రాత్రిపూట ఇంటికి వస్తుండగా వీధికుక్కలు వెంటపడి తరిమాయి. దీంతో తీవ్ర భయాందోళనలకు గురయ్యాను. వీధి కుక్కల వల్ల ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయంగా ఉంది. ముఖ్యంగా మహిళలు, చిన్నారులు బయటకు వెళ్లిన వారు క్షేమంగా వచ్చే వరకు ఆందోళనగా ఉంది. వీధి కుక్కలను ఎప్పటికప్పుడు అధికారులు నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలి. – కె.సత్యనారాయణ, రిటైర్డ్ డెప్యూటీ పారామెడికల్ ఆఫీసర్

అధికారులు చర్యలు తీసుకోవాలి..



నా కుమారుడి వైద్య సేవల నిమిత్తం నేను తరచూ బయట తిరుగుతుంటాను. రోడ్డుపై రాత్రిపూట వెళ్తున్నప్పుడు కుక్కలు ఒక్కసారిగా భీకరంగా అరుస్తూ వెంటపడి తరుముతున్నాయి. అసలు రాత్రిపూట రోడ్డుపై వెళ్లాలంటేనే భయంగా ఉంది. ఎంతో మంది వీధి కుక్కల వల్ల తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. – జి.మురళీకృష్ణ, స్థానికుడు

నేడు స్థాయీసంఘ సమావేశం



సమావేశమైన వీఎంసీ స్థాయీసంఘం(ఫైల్)

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో జరిగే పలు అభివృద్ధి పనులపై మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం స్థాయీ సంఘ సమావేశం జరగనుంది. ఇందులో మొత్తం 37 అంశాలు ఎజెండాలో పొందుపరచగా వాటిపై సభ్యులు చర్చించి నిర్ణయం తీసుకుంటారు.

ప్రధానాంశాలు..

- స్వచ్ఛ సర్వేక్షణ్–2020లో నగరంలోని వివిధ డివిజన్లలో పారిశుద్ధ్య నిర్వహణకు 04.01.2020 నుంచి 11.01.2020 తేదీ వరకు వారం రోజుల పాటు పారిశుద్ధ్య కార్మికులను వీఎంసీ కాంట్రాక్టర్ ద్వారా నియమించుకుంది. దీనికి సంబంధించి వారం రోజులకు వర్క్ ఆర్డర్ ఇచ్చింది. కానీ 28 రోజుల పాటు జరిగినట్లు కాంట్రాక్టర్లు రూ.33.60 లక్షలు బిల్లులు అధికారులకు సమర్పించటంతో వీఎంసీ ప్రజారోగ్యం, ఇంజినీరింగ్ విభాగం అధికారులు స్థాయీసంఘానికి నివేదించారు. దీనిపై స్థాయీసంఘం చైర్మన్ మేయర్ రాయన భాగ్యలక్ష్మి రెండుసార్లు వాయిదా వేయగా మళ్లీ బిల్లు స్థాయీసంఘం ముందుకు రావటం చర్చనీయాంశంగా మారింది. పనిచేయకుండానే అధికారులకు బిల్లులు సమర్పించారని, వర్క్ ఆర్డర్ లేకుండా బిల్లులు చెల్లింపులపై అప్పట్లో మేయర్ అధికారులపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇదే అంశం మళ్లీ స్థాయీసంఘం దృష్టికి రావటం చర్చనీయాంశంగా మారింది. దీనిపై స్థాయీసంఘం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.
- విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్ సైడ్ మార్జిన్ పార్కింగ్ ప్రదేశం ఏడాదిపాటు లీజుకు ఇచ్చే క్రమంలో టెండరు కమిటీ సూచన మేరకు వీఎంసీ ఎస్టేట్స్ విభాగం కాంట్రాక్టర్ల నుంచి సీల్డ్ కం ఓపెన్ టెండర్లు పిలిచింది. ఇందులో 14 మంది పాల్గొనగా స్థాయీసంఘం ఎవరికి కేటాయించాలనే దానిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.
- సర్కిల్–1 పరిధిలోని 43వ డివిజన్‌లో ట్రాన్స్‌పోర్టు ఆఫీస్ రోడ్డును బీటీ రోడ్డుగా వేయటానికి రూ.49.25 లక్షలు, 45వ డివిజన్‌లోని ఎస్‌కేటీ వెస్ట్ మిడోస్ అపార్టుమెంట్ రోడ్డును బీటీ రోడ్డుగా వేయటానికి రూపొందించిన అంచనాలు రూ.43.23 లక్షలు వీఎంసీ సాధారణ నిధుల నుంచి కేటాయింపులు చేయాలని ప్రతిపాదనపై స్థాయీ సంఘం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

కండ్రిక చెరువులో శ్మశానవాటిక నిర్మాణం



చెరువును పరిశీలిస్తున్న అధికారులు

పాయకాపురం(విజయవాడరూరల్): విలేజి కండ్రిక(64వ డివిజన్)లో ఇరిగేషన్‌కు సంబంధించిన పంట చెరువులో విజయవాడ నగరపాలక సంస్థ శ్మశానవాటికను నిర్మించనుంది. నీటిపారుదల శాఖకు సంబంధించిన చెరువులు, కుంటలు ఆక్రమించకూడదని.. ఎలాంటి బదలాయింపులు చేయకూడదనే ఆదేశాలున్నాయి. ఇటీవల వచ్చిన బుడమేరు వరదల నష్టానికి చెరువుల్లోని ఆక్రమణలే కారణమని.. వాటిని తొలగించాలని హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. దీంతో అనేక చెరువుల్లో ఆక్రమణలను తొలగించారు. ఆర్ఎస్ నంబరు 17లో 33.17 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉందని.. చెరువు ఆయకట్టు పరిధిలో దాదాపు 125 ఎకరాల వ్యవసాయ భూములున్నట్లుగా అధికారులు చెబుతున్నారు. ఆ వ్యవసాయ భూములకు ఈ చెరువు నుంచే ఏటా సాగునీటిని రైతులు వినియోగించి పంటలను పండిస్తున్నారు. ఇరిగేషన్ శాఖ నుంచి శ్మశానవాటిక నిర్మాణానికి అనుమతులు లేవని ఆ శాఖ ఏఈ రాజశేఖర్ తెలియజేశారు. ఆ చెరువులో శ్మశానవాటిక నిర్మించడానికి విజయవాడ నగర పాలక సంస్థ రూ.17 లక్షలు మంజూరు చేసిందని ఏఇ మాధవ్ తెలిపారు. విలేజి కండ్రిక సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ శ్రీకాంత్‌ను వివరణ కోరగా చెరువులో కొంత ప్రాంతం శ్మశానవాటికగా రికార్డులో ఉందన్నారు.

గ్రంథాలయ సంఘం సేవలు అమోఘం



నేతల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న ప్రసాద్, గ్రంథాలయ సంఘం ప్రతినిధులు

పటమట(విజయవాడతూర్పు): భారతదేశంలో మొట్టమొదటి గ్రంథాలయ సంఘం 110 సంవత్సరాల క్రితం స్థాపితమై నేటికి అదే ఆశయంతో కృషి చేయటం గొప్ప విషయమని ప్రభుత్వ ఆస్పత్రి రిటైర్డ్ వైద్యాధికారి, పుస్తక ప్రియుడు డాక్టర్ డి.ప్రసాద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విజయవాడలోని పాతూరి నాగభూషణం గ్రంథాలయ శిక్షణాలయం ఆధ్వర్యంలో గురువారం సర్వోత్తమ భవనంలో జరిగిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక స్వచ్ఛంద సేవా సంస్థ శతాధిక సంవత్సరాలుగా మనుగడ సాగిస్తూ మరింతగా ఉత్సాహంగా పనిచేయడం అపురూపమన్నారు. సమాజంలో అందరూ విద్యా విజ్ఞానవంతులవ్వాలని తలంపుతో అయ్యంకి వెంకటరమణయ్య స్థాపించిన గ్రంథాలయ సంఘం పాతూరి నాగభూషణం, రావి శారదల నేతృత్వంలో మరింత ముందుకు సాగుతూ విజ్ఞానదాయక ఫలాలు అందించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావి శారద కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రంథాలయ సంఘ ఆవిర్భావ విశేషాలను సాధించిన విజయాలను వివరించారు. గ్రంథాలయ శిక్షణాల విద్యార్థులు గురుమూర్తి, శ్రీరాములు, లిఖిత ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం, గ్రంథాలయ ఉద్యమంలోని ముఖ్య ఘట్టాలను తెలియజేశారు. తొలుత సంఘ స్థాపకుడు వెంకటరమణయ్యతో పాటు గాడిచర్ల, పాతూరి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

వక్ఫ్ చట్ట సవరణ మత స్వేచ్ఛపై దాడే



నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లిం సంఘాల ప్రతినిధులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): దేశంలో వక్ఫ్ సవరణ చట్టం బిల్లు మత స్వేచ్ఛపై దాడేనని, ఇతర మతాలకు వర్తించని నిబంధనలు ముస్లింలకు ఎందుకని జమాఅతే ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు రఫీక్ అహ్మద్ ప్రశ్నించారు. ఇది ఆర్టికల్ 14, 25, 26, 28లను ఉల్లంఘిస్తుందని పేర్కొన్నారు. ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో లబ్బీపేటలోని తౌహీద్ మసీదులో గురువారం ముస్లిం సంఘాల కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణకు వక్ఫ్ జేఏసీ ఏర్పాటు చేశారు. రాజ్యాంగ పరిధిలో పోరాటం చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా రఫీక్ అహ్మద్ మాట్లాడుతూ వాస్తవానికి వక్ఫ్ సవరణ బిల్లు అత్యంత ప్రమాదకరమైనదన్నారు. ఈ బిల్లు భారత రాజ్యాంగానికి విరుద్ధమని, కొత్త చట్టం ప్రకారం రాబోయే వక్ఫ్ ఆస్తులు ముస్లిం ఆధీనంలో ఉండవన్నారు.

దశలవారీగా పోరాటం..

ముస్లిం జేఏసీ కన్వీనర్ మునీర్ అహ్మద్ మాట్లాడుతూ.. వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లులో కొన్ని అభ్యంతరకర అంశాలపై సూచనలు చేశామన్నారు. ఎన్డీఏ కూటమిలో ప్రధాన భాగస్వామి అయిన చంద్రబాబు అండగా ఉంటామని చెప్పి ముస్లింలకు ద్రోహం చేశారన్నారు. బిల్లుకు పూర్తి మద్దతు ప్రకటించారని, వారు సూచించిన అంశాల ప్రస్తావనే బిల్లులో లేదని మునీర్ అహ్మద్ విచారం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో రాజ్యాంగబద్ధంగా దశలవారీగా పోరాటం చేయాలని నిర్ణయించామన్నారు. సమావేశంలో అహిలే హదీస్ నగర అధ్యక్షుడు నసీర్ అహ్మద్ ఉమ్రి, మజ్లిస్ ఉల్ ఉలేమా – వ-ఐమా ప్రతినిధులు ముఫ్తి యూసఫ్, ముఫ్తి హబీబ్, నూరిషా జమాత్ ప్రతినిధులు అదిల్ షా, ముస్లిం అడ్వకేట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ మతీన్, ప్రముఖ వైద్యులు ఎంఏ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో యోగా శిక్షణ

పటమట(విజయవాడతూర్పు): పటమటలోని సచ్చిదానంద ఆశ్రమంలో ఈ నెల 12, 13, 14 తేదీల్లో ఉచితంగా దత్తక్రియ యోగా నిర్వహిస్తున్నట్లు దత్తక్రియ యోగా శిక్షణ విజయవాడ శాఖ సమన్వయకర్త దంతలూరి తిరుపతిరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణ తరగతులకు పదేళ్లు పైబడిన వారి నుంచి వృద్ధుల వరకు, కుల, మత, వర్ణ, వర్గ బేధాలు లేకుండా ఎవరైనా పాల్గొనవచ్చన్నారు. దత్తక్రియా యోగం వల్ల శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక ప్రగతి వంటి ఎన్నో రకాల ప్రయోజనాలు తక్కువ శ్రమతో ఎక్కువ ఫలితం పొందవచ్చన్నారు. వివరాలకు 98660 41332 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రోడ్లపై ఆవులను వదిలితే రూ.10 వేలు జరిమానా



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో రోడ్లపై జంతువులను, ఆవులను వదిలేవారికి రూ.10 వేల జరిమానా విధిస్తామని వీఎంసీ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్(వీఏఎస్) డాక్టర్ బీఎస్ఎస్ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోడ్లపై పశువులను వదిలి పెట్టడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. వీటివల్ల ప్రమాదాలు కూడా అధికంగా జరుగుతున్నాయని, ప్రజలకు అసౌకర్యం కలిగించే అంశాలను దృష్టిలో పెట్టుకుని ఈ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆవులను రోడ్లపై వదిలిపెట్టకుండా నియంత్రించేందుకు అజిత్ సింగ్‌నగర్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన క్యాటిల్ షెడ్‌లో గోవులు ఆరోగ్య సంరక్షణలో ఉంటాయన్నారు. రోడ్లపై పశువులను వదిలిపెట్టకుండా సహకరించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని చెప్పారు. ప్రజల భద్రత, ట్రాఫిక్ సౌలభ్యం, పర్యావరణం పరిరక్షణే ఈ చర్యల ప్రధాన లక్ష్యమన్నారు.

గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాలు బహూకరణ



దాతలను సత్కరిస్తున్న గ్రంథాలయ సిబ్బంది

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు దాతలు పోటీ పరీక్షల పుస్తకాలు బహూకరించారు. సాయిసేవా సమితి సభ్యుడు నారాయణరావు, మహాలక్ష్మి దంపతులు పుస్తకాలను గ్రంథాలయాధికారికి గురువారం అందజేశారు. పోటీ పరీక్షలకు అవసరమైన రీజనింగ్, అర్థమెటిక్, ఇంగ్లిష్, జనరల్ స్టడీస్, పుస్తకాలతో పాటు డీఎస్సీ అభ్యర్థులకు అవసరమైన రూ.3 వేల ఖరీదు చేసే పుస్తకాలు అందజేశారు. దాత నారాయణరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ జీవితంలో జరుపుకొనే పుట్టిన రోజు, పెళ్లి రోజు వంటి ప్రత్యేక రోజుల్లో బహుమతులు అందజేయాలన్నారు. అనంతరం దాతలను గ్రంథాలయాధికారి కె.రమాదేవి, నాగరాజు సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, సాయి సేవా సమితి సభ్యులు నాదెండ్ల ఉమాదేవి, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సమస్యల పరిష్కారానికి తలపెట్టిన దీక్ష వాయిదా

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్రంలో క్రీడాకారులు, క్రీడా సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 11వ తేదీన ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) కార్యాలయం ముందు నిర్వహించ తలపెట్టిన నిరసన దీక్షను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి కె.పి.రావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. క్రీడా సమస్యలు, జీవోలను విడుదలలో రాష్ట్ర ప్రభుత్వం వహిస్తున్న జాప్యానికి నిరసనగా దీక్ష చేపట్టాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. అయితే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు, ఉన్నత విద్యకు సంబంధించిన జీవోను త్వరలో ప్రభుత్వం విడుదల చేయబోతుందనే సమాచారం క్రీడా శాఖ ఉన్నతాధికారుల ద్వారా తనకు తెలిసిందన్నారు. ఈ నేపథ్యంలో నిరసన దీక్షను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు. క్రీడా సంఘాల మధ్య నెలకొన్న వివాదాలు, క్రీడల్లో అవినీతి, శాప్‌కు పర్మినెంట్ ఎండీ నియామకం, ఒలింపిక్ క్రీడలతో సమానంగా నాన్ ఒలింపిక్ క్రీడలకు న్యాయం చేయాలనే డిమాండ్‌లతో 16వ తేదీన శాప్ కార్యాలయం ముందు నిరసన దీక్షకు దిగుతానని స్పష్టం చేశారు.

‘చెరుకూరి’ దీక్ష విరమణ

విజయవాడస్పోర్ట్స్: ఓల్గా ఆర్చరీ అకాడమీని అభివృద్ధి చేస్తామని సీఎం చంద్రబాబు రెండు పర్యాయాలు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ అకాడమీ అధ్యక్షుడు, ఆర్చరీ సీనియర్ కోచ్ చెరుకూరి సత్యనారాయణ చేస్తున్న నిరాహారదీక్ష గురువారం విరమించారు. విజయవాడ వేదికగా ఓల్గా ఆర్చరీ అకాడమి ఎంతో మంది యువతను జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దింది. ఈ నేపథ్యంలో 2015, 2019 లలో విజయవాడలో జరిగిన గిడుగు వర్ధంతి వేడుకల్లో చంద్రబాబు సీఎం హోదాలో అకాడమీ అభివృద్ధికి హామీ ఇచ్చారు. దీనిని అమలు చేయాలని కోరుతూ శాప్‌కు సత్యనారాయణ లేఖ రాశాను. అమలు చేసేది లేదంటూ శాప్ నుంచి వచ్చిన లేఖతో మనస్తాపం చెందిన ఆయన ఈ నెల 7న నిరవధిక దీక్షకు దిగారు. ఈ క్రమంలో గురువారం ఉదయం సీఎం కార్యాలయ ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్న ఫోన్‌లో సత్యనారాయణను సంప్రదించారు. సీఎంవోకు రావాలని సూచించగా ఆయన వెళ్లి చర్చలు జరిపారు. ఈ డిమాండ్‌లను సీఎం దృష్టికి తీసుకెళ్లి రెండు రోజుల్లో సమాచారం అందిస్తామని కార్యదర్శి ప్రద్యుమ్న ఇచ్చిన హామీతో దీక్షను విరమించారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): కుటుంబ సమస్యల కారణంగా తన తండ్రి కనిపించడం లేదంటూ అతని కుమార్తె అజిత్ సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం న్యూ ఆర్ఆర్‌పేటకు చెందిన రామనాథం సాంబశివరావు(72) దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నారు. సాంబశివరావుకు కుటుంబ సమస్యలతో గురువారం ఇంట్లో వాగ్వాదం జరిగింది. దీంతో అతను ఇంట్లోంచి వెళ్లిపోతున్నానని తన గురించి వెతక వద్దంటూ చెప్పి వెళ్లిపోయారు సాయంత్రం అయినప్పటికీ సాంబశివరావు తిరిగి ఇంటికి రాకపోవటంతో పాటు ఫోన్ చేసినప్పటికీ లిఫ్ట్ చేయటం లేదు. చుట్టుపక్కల తెలిసిన వారి వద్ద విచారించినప్పటికీ ఫలితం లేకపోవటంతో గురువారం రాత్రి ఆయన కుమార్తె గోలి తారాదేవి అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువతి అదృశ్యంపై తల్లి ఫిర్యాదు చేయగా కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్టినగర్ గౌతమ్ స్కూల్ ప్రాంతంలో ఉంటున్న దంపతులకు ఇద్దరు కుమార్తెలు. రెండో కుమార్తె(23) ఉద్యోగం నిమిత్తం బయటకు వెళుతున్నానని ఇంటి నుంచి వెళ్లారు. తన నుంచి ఎటువంటి స్పందనా లేకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారిని ఆరా తీశారు. వారి నుంచి కూడా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి



కట్టెల పొయ్యిపై వంట వండుతూ నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ మహిళ సమాఖ్య విజయవాడ నగర సమితి ఆధ్వర్యంలో పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని కోరుతూ గురువారం పైపులరోడ్డు సెంటర్‌లో కట్టెల పొయ్యిపై వంట వండుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య విజయవాడ నగర అధ్యక్ష కార్యదర్శులు ఓర్సు భారతి, పంచదార్ల దుర్గాంబ మాట్లాడుతూ.. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అనేక రకాలుగా వాగ్దానాలు చేసిందన్నారు. ముఖ్యంగా అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్‌లో దీపం పథకం కింద ప్రతి ఇంటికి ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తామని వాగ్దానం చేసిందని చెప్పారు. అధికారంలోకి వచ్చిన 10 నెలల కాలంలోనే సిలిండర్‌పై 50 రూపాయలు పెంచి సామాన్య ప్రజలకు సౌకర్యాలను దూరం చేసే విధంగా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. సీపీఐ నగర కార్యదర్శి వర్గ సభ్యులు మాట్లాడుతూ పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు లింగాబత్తుల శివ కుమార్, కె.ఆదినారాయణ, గురవయ్య, కార్తీక్, నగర మహిళా సమాఖ్య నాయకులు నిలాపు భాగ్యలక్ష్మి, నాగూర్, బి.మల్లేశ్వరి, నిర్మల, కన్నమ్మ, భాను, రాణి, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ కన్వెన్షన్ సెంటర్‌ను పూర్తి చేయండి

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనంలో నిర్మాణంలో ఉన్న కన్వెన్షన్ సెంటర్‌ను త్వరగా పూర్తి చేయాలని ఇండియన్ అంబేడ్కర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ జయంతి వేడుకలను ప్రభుత్వమే నిర్వహించాలని, అందుకోసం రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. విజయవాడలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అంబేడ్కర్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులు ఇచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా అధికారికంగా అన్ని జిల్లా కేంద్రాల్లో, విద్యా సంస్థల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించేలా ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతి అంబేడ్కర్ జయంతికి ఎస్సీలకు ప్రత్యేక సంక్షేమ కార్యక్రమాలు ప్రకటించే వారని, రాష్ట్రంలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, ఎస్సీ రిజర్వేషన్లు 14 నుంచి 15 శాతానికి పెంపు, వివిధ రంగాల్లో నైపుణ్యం ఉన్న వారికి దళిత రత్న అవార్డులు ఇచ్చే వారన్నారు. అంబేడ్కర్ రాష్ట్ర స్థాయి అవార్డులను ప్రకటించాలని కోరారు.

దాడులు అరికట్టాలి..

రాష్ట్రంలో దళిత మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంతో పాటు విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ పెంపు, స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేసి సివిల్స్, గ్రూప్స్‌కు ఉచిత కోచింగ్ ఇవ్వాలని డాక్టర్ తారకప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.